అతనికి
ఆమె పంపిన
ప్రేమ సందేశం
అతనికే చేరిందా?

# టేకిట్ ఈజీ

ఆరె
పద్మజాచౌదరి
కథ

"ఇక నిద్రపోనీయి" అంది గారంగా సీత.

"ఊహు!" అన్నాడు రాజేష్ మొండిగా.

ఆమె ఏదో చెప్పబోయింది.

అతడు చెప్పనీయలేదు.

తెరచిన ఆమె నోటికి తాళం వేశాడు.

"ఇలాగైతే ఎలా" అంది చాలా సేపటికి.

అతడు మనోహరంగా నవ్వాడు.

ఆమె కళ్లల్లోకి సూటిగా చూచి.

"వన్ మోర్ రౌండ్" అన్నాడు.

ఆ అమ్మాయికి సిగ్గు ముంచుకొచ్చింది. చెంపలమీద ఎర్రగులాబీలు పూచాయి.

"ఛీ... పో..." అంది కోపం నటిస్తూ.


అతడు ఆమెను మరింత గాఢంగా హత్తుకున్నాడు.

"రేపు ప్రొద్దున్నే వెళ్లాలి. ఫ్లైట్ మిస్ అయితే ఎలా?" అనుమానంగా.

ఆమెకు సాయంత్రం నుండి అదే అనుమానం ... అతడు నిద్రపోడు... తనను పోనీయడు. ఎనిమిది గంటలకు ఉదయం యునైటెడ్ ఎయిర్ లైన్స్‌లో న్యూయార్క్‌కి టికెట్స్‌కి బ్లాక్ అయ్యాయి. అప్పుడే చెప్పింది" మనం ప్రొద్దున ఫ్లైట్‌కి వెళ్లలేం... మధ్యాహ్నమో, సాయంత్రమో బుక్ చెయ్యి" అని.

అతడు వినిపించుకోలేదు. దర్జాగా ట్రావెల్ ఏజెంట్ కేసి తిరిగి "నో ప్రాబ్లెం" అన్నాడు.

ఎంత హుందాగా చెప్పాడు!



ఎంత బుద్ధిమంతునిలా ప్రవర్తించాడు!

అది అంతవరకే ఆ విషయం ఆమెకు అనుభవమే. అందుకే ఫ్లైఫైట్స్‌కి మిస్ కాకుండా వేళకు అందుకోవాలని ఆమె ఆరాటం.

"నో ప్రాబ్లెం... అలారం సెట్ చేశాను" అన్నాడు హోమీ ఇస్తూ, ఆమె ముంగురులు సవరిస్తూ.

ఆమెకు ఒక్క క్షణం నిశ్చింత అనిపించింది. అతడు నిద్రపోయే వరకూ ఆమెనూ పోనివ్వలేదు. బలవంతాను లేపుతాడు "నేను చెప్పేది వినడంలేదు" అని నిందిస్తాడు. "అదిగో కళ్లు మూసుకుంటున్నావు" అని అలుగుతాడు. ఏదో ఒకటి చేసి ఆమెకు నిద్రాభంగం కలిగిస్తాడు.

అలా కోతి చేష్టలు చేసి చేసి అలసిపోయి అతడు నిద్రపోయే సరికి మూడు గంటలైంది. టైం గమనించుకున్న సీత ఉలిక్కిపడింది. ఆరు గంటలకు ఇంట్లోనుండి బయలుదేరితేగానీ కుదరదు. అంటే కనీసం ఐదున్నరకు లేవాలి.

సాధ్యమేనా

భయంతో ఆమెకు మరో అరగంట నిద్రపట్టలేదు.

గాఢనిద్రలో ఉలిక్కిపడి లేచి చూస్తే టైం ఏడు గంటలు.

భర్తకేసి చూసింది.

అల్లరిచేసి అలసిపోయి నిద్రపోయిన పాపాయిలా అతడు. వాత్సల్యం వెల్లువలా పొంగి పొరలింది.

కొద్దిగా అతనివైపుకు జరిగి, మెడ ఎత్తి విశాలంగా వున్న అతని పాలభాగాన్ని మృదువుగా ముద్దాడింది.

ఆ మృధుత్వానికే అతడు కదిలిపోయాడు. నిద్రలో సైతం ఆమెను దగ్గరకు తీసుకోవడం మర్చిపోలేదు.

'ఏడు గంటలయ్యింది' అంది గుసగుసగా. కొరడాతో కొట్టినట్లే లేచాడు.

బ్లాంకెట్ మడత అయినా పెట్టకుండా గబగబా తయారయ్యాడు.

"చెబితే వినలేదు" అందామె నిందాత్మకంగా కాబ్‌లో కూర్చున్నాక.

"నో ప్రాబ్లెం" అన్నాడు ఎప్పటిలా.

"మనవ్వనగానే అక్కడ ఫ్లైట్ ఆగిపోతుంది" అంది కినుకగా.

అప్పుడేం చెప్పినా లాభం లేదని అతనికి తెలుసు. అయినా లోపల అతనికీ అనుమానమే. బయటకు గంభీరంగా వున్నాడు.

ఓహెర్‌దగ్గరకొచ్చేసరికి ఎనిమిది దాటింది. సీత ముఖం పాలిపోయింది.

"టిక్కెట్స్ గార్బేజీ పాలవుతాయా" అంది వాటి వెలను గుర్తుచేసుకుంటూ.

రాజేష్ బదులివ్వకుండా కాబ్‌కు పే చేసి రెండు సూట్‌కేసులూ తీసుకున్నాడు. అతని వెనుకే వేనిటీ బాగు ఊపుకుంటూ, ప్రపంచభారాన్ని మోస్తున్న దానిలా వగర్చుకుంటూ సీత.

వాళ్లు గేట్ నెంబర్ ఎనిమిదికి వెళ్లేసరికి అక్కడ యునైటెడ్ ఎయిర్‌లైన్స్ కౌంటరు మూసేసి వుంది. అంటే ఫ్లైట్ వెళ్లిపోయింది.

"ఇప్పుడెట్లా" అంది నీరసంగా. వేస్టయిన డబ్బులకన్నా ప్రోగ్రాం కాన్సిల్ అవుతుందేమోనని ఆమె బాధ.

"తర్వాత ఫ్లైటులో సీట్లు వుంటే అందులో ఇస్తారు" అన్నాడు.

"హమ్మయ్య" అనుకుంది.

తర్వాత ఫ్లైట్ పన్నెండు గంటలకు. పదకొండు గంటలకు గానీ యునైటెడ్ ఎయిర్‌లైన్స్ కౌంటర్ తెరవరు.

సూట్‌కేసుల్ని చూసుకుంటూ కాలక్షేపం చేశారు. కొత్త దంపతులకు ఎక్కడైతేనేం

కాలం ఇట్టే దొర్లిపోయింది.

యునైటెడ్ ఎయిర్‌లైన్స్‌వాళ్లు ఓపిగ్గా అతడు చెప్పింది విని "మీకు సహాయం చేయడానికి ప్రయత్నిస్తాం" అన్నారు.

కంప్యూటర్లో లిస్టు చూసి "సీట్లయితే వున్నాయి" అందామె.

సంశయం ఏమిటో అతనికి అర్థం కాలేదు.

"అయితే పక్కపక్కనే లేవు"

రాజేష్ ఆమెకేసి చూశాడు.

రాజేష్ వెనగ్గా నిల్చొని అతని ఎడమ చేతిని గట్టిగా పట్టుకుని వున్న సీత ముఖం చిన్నబోయింది. "నిన్నొదిలి ఎలా వుంటాము" అన్నాయి ఆమె కళ్లు.

"ఎంతసేపు" రెండు గంటలు అన్నాడు అనునయంగా.

"సరే" అంది అంగీకారంగా.

"ఓకే" అన్నాడు అతడు.

ట్రావెలింగ్ క్లర్కు గబగబా తన పని చేసేసుకుని ఇద్దరికీ టికెట్లు ఇచ్చింది. అతని సీటు ఆమె సీటు చెరొక దిక్కులో ఉన్నాయి. కనీసం ఒకరికొకరు కనిపించేలా గూడా లేవు.

సీతకు ఉక్రోషం, రోషం.

"నీ మూలంగానే" అంది.

"అంతా నామీదకు నెట్టేస్తావ్... యూ జిఫ్‌యు డిడ్‌నాట్ లైకిట్" అన్నాడు.

"లైక్ వాట్" అంది అమాయకంగా.

"దట్ హేపెండ్ లాస్ట్ నైట్"

"ష్... కనీసం తెలుగులోనైనా చెప్పు" చుట్టూ చూస్తూ గాభరాగా అంది.

"భయమేం లేదు... మాటలకేం... ఇక్కడ అందరూ చేతలే చూపుతారు. నయాగరాలో చూస్తావుగా!"

"నయగారా దాకా ఎందుకులే! ఎక్కడంటే అక్కడే" చీదరగా అంది.

"అలా చీదరించుకోకు. అది వాళ్ల కల్చర్"

## యాక్సిడెంట్

"యాక్సిడెంటయి ట్రాఫిక్ జామయిపోతే ట్రాఫిక్ పోలీస్ ఏం చేస్తున్నాడు?

"యాక్సిడెంటయింది ట్రాఫిక్ పోలీస్‌కే"

"అయితే పోలీసుల్ని పిలవండి"

"పోలీస్ జీపే గుద్దేసింది"

"హా!"

— కాట్నం వెంకటరెడ్డి (ఈస్ట్ విప్పరు)



''నాకు నచ్చలేదు''

''నచ్చనిదాన్ని చూసికూడా మెచ్చుకోవటం నేర్చుకోవాలి''

''ఇదికూడా అమెరికన్ కల్చరేనా''

''సర్టెన్లీ''

విమానం దాకా వెళ్లాక బాధగా విడిపోయారు. వియోగం భరించలేనిదానిలా బిక్కమంటూ ఎయిర్ హోస్టెస్ చూపించిన వైపు వెళ్లి తన సీటు నంబరు చూసుకుని కూర్చుంది. కూర్చున్నాక చుట్టూ కలయచూచింది. రాజేష్‌కోసం. అతడు కనబడలేదు. దుఃఖం ముంచుకువచ్చింది.

అతని చిటికెన వేలు పుచ్చుకునే గదా భరతఖండంనుండి అమెరికా ఖండానికి ఎగిరి వచ్చింది. అతని రెక్కలమాటున తనను భద్రంగా దాచుకుంటాడన్న నమ్మకంతోనేగదా అమ్మా నాన్ననూ, అయినవాళ్లనూ, పుట్టినింటినీ, దేశాన్ని వదిలివచ్చింది.

అమ్మా, నాన్న, ఇండియా గుర్తుకొచ్చాక ఆమె దుఃఖం రెట్టింపయింది. రాజేష్‌ను గుర్తుచేసుకుని మర్చిపో ప్రయత్నించింది.

ఎయిర్ హోస్టెస్ ఇచ్చిన ట్రేలోని తిండి ఒక్కటీ సహించేదిగా లేదు. ఒక్క వెరుశెనగ పప్పులు తప్ప. ఆకలిగా వుంది. అవి తిని మళ్లీ అవే కావాలని అడిగింది. ఐదు నిమిషాల్లో నట్స్ ఆమె ముందున్నాయి. శుభ్రంగా తిని, కివీ పండుముక్కలు, నాలుగు ద్రాక్షలు తిన్నాక ఆరెంజ్ జ్యూస్ తాగేసరికి ఆకలిమంటలు చల్లారిపోయాయి.

''రాజేష్ ఏం తిన్నాడో'' అనిపించింది. ఇప్పుడు తన ప్రక్కన వుంటే ఏదో ఒకటి బలవంతాన నోట్లో పెట్టి చేయించేవాడు. ''మొండి! అల్లరి!'' అనుకొని నవ్వుకుంది.

అతడ్ని ఆట పట్టించాలనిపించింది. అల్లరి ఆలోచనలు అలలు అలలుగా కదిలాయి.

ఊహించుకున్నకొద్దీ ఆమె ఆనందం అంచులో దాటి ప్రవహించింది.

''అంతే చెయ్యాలి!'' అనుకుంది.

బ్యాగ్ తెరిచి చిన్న తెల్లకాగితం, పెన్ను తీసుకుని, చకచకా వ్రాసింది... ఇంగ్లీషులో సాగిన ఆ లేఖా సారాంశం.

''డియర్

న్యూయార్కులో దిగగానే నాతో వస్తావా

ఎదురుచూస్తూ

నీ

సంతకం పెట్టలేదు.

అతనికి తన దస్తూరి గుర్తో లేదో!

గుర్తులేకపోతే మరీ మంచిది.

ఆ చిట్టీ ఎన్వెలప్‌లో సీల్ చేసి, పైన 'సీటు నెంబరు 16సి' అని వ్రాసింది.

అటుగా వస్తున్న ఎయిర్ హోస్టెస్‌ని చూచి ''ఎక్స్క్యూజ్ మీ'' అంది.

''వాట్ కెన్ ఐ డు ఫర్ యు'' అంది ఆమె వినయంగా.

''ఈ కవరు సిక్స్‌టీన్ సీలో ఇవ్వగలరా ప్లీజ్''

''ఓకే'' నవ్వుకుంటూ వెళ్లిపోయింది.

''మరో పావుగంటకు అదే నవ్వు ముఖంతో వచ్చి సీత చేతిలో ఒక కవరు వుంచి వెళ్లింది. ఆత్రంగా విప్పి చదివింది.

''డియర్ అన్‌నోన్...

థాంక్యూ వెరీమచ్... మీ ఆహ్వానం అందింది. అయితే నేను నా హనీమూన్‌లో వున్న కారణంగా అంగీకరించలేకపోతున్నాను. అవకాశం వుంటే మరెప్పుడైనా

యువర్స్

క్రింద సంతకం లేదు. 'సిక్స్‌టీన్ సి'

అవి మాత్రం వుంది. కవర్లో చిన్న లిప్‌స్టిక్. ఎవన్ కంపెనీది. ఆమెకు కానుకగా.

దాన్ని తీసుకుని అపురూపంగా హృదయానికి హత్తుకుంది. రాజేష్ తన దస్తూరి కనిపెట్టాడు. అందుకే చివర్లో కొంటెగా 'మరెప్పుడైనా' అని వ్రాశాడు. 'అల్లరి' అనుకుంది.

కవర్ని తీసి బ్యాగులో భద్రం చేసింది. "ఇంతకన్నా నిధి నిక్షేపాలు బ్రతుకు మార్గంలో ఇంకేం లభిస్తాయి"

జీవన పోరాటంలో అలసిపోయినప్పుడు జ్ఞప్తికి వచ్చి సేద తీర్చేది ఈ తీపిగురుతులేగదా!

ఆమె అధరాలపైన ఆహ్లాదకరమైన హాసం.

అతని చెంతకు వెళ్లి అతని గుండెమీద వాలిపోవాలన్న ఆరాటం.

క్షణమొక యుగంలా గడిచిపోయాక

జె.ఎఫ్.కె. ఎయిర్‌పోర్టులో యుగాల తర్వాత కల్సుకున్నట్లు ఆర్తిగా ఒకరినొకరు చూసుకున్నారు. హోటల్ రూంకు వెళ్లేవరకు ఆమె అతనితో ఈ విషయం ప్రస్తావించలేకపోయింది.

"మరెప్పుడైనా అంటే... ఇప్పుడేనా" అంది కొంటెగా.

అతనికి అర్థం కాలేదు. అతనికి అర్థం అయ్యేసరికి పది నిమిషాలు పట్టింది.

"నువ్వు నాకు చిట్ పంపావా, లేదే" అన్నాడు అయోమయంగా.

అయోమయం ఈసారి ఆమెను వరించింది.

ఏదో అనుమానం ముప్పిరిగొనగా పాలిపోయిన ముఖంతో పర్సులోనుండి అతనినుండి వచ్చిన రిప్లై, లిప్‌స్టిక్ తీసి చూపించింది.

రాజేష్ ముఖం ముందు కందగడ్డలా మారిపోయింది. తర్వాత తమాయించుకుని సర్దుకున్నాడు.

"అంతా కాగితంమీదే గదా పోనీలే" అనుకున్నాడు. అంతా మనసంతా ఏదో చేదు. దాన్ని బయటకు ప్రదర్శించకుండా నవ్వు ముఖంతో ఆమెకేసి అల్లరిగా చూశాడు.

ఏం జరిగిందో ఆమెకు అర్థం కావడంలేదు.

"ఆ లిప్‌స్టిక్..." అంది. అర్థాంతరంగా.

అతడు ఈసారి పెద్దగా నవ్వి "నీతూ" అన్నాడు.

"నో సస్పెన్స్... టాక్ స్ట్రెయిట్" అంది కోపంగా.

"ది ట్రిక్ బ్యాక్‌ఫైర్డ్" అన్నాడు.

ఆమె ముఖం మాడిపోయింది "ఎలా" అంది.

"ఇలా" అన్నాడు దగ్గరకు తీసుకోబోతూ.

"వీల్లేదు... నాకు అసలు విషయం చెప్పు" అంది దూరం జరుగుతూ.

అతడు అయిష్టంగా చెప్పాడు.

"నా సీటు నెంబరు ఫోర్టీన్ సి" అని.

ఆమె మోము అమవస నిశిలా నల్లగా... తలెత్తి చాలాసేపు అతనికేసి చూడలేకపోయింది.

"టేకిట్ ఈజీ" అన్నాడు లాలనగా.

ఆ కవర్లోని కాగితాన్ని వంద ముక్కలు చేసినాగూడా ఆమె బాధ తీరలేదు. లిప్‌స్టిక్‌ని తీసుకెళ్లి కసిగా డస్ట్‌బిన్‌లో విసిరివేసింది. అతడు మాత్రం "టేకిట్ ఈజీ" అని అంటూనే వున్నాడు.

▶ ◆ ◀